క్లుప్తంగా

మట్టి ఖర్చులు అందజేత



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం పెదకొండూరులో గుండెపోటుతో ఓ యువకుడు మృతి చెందడంతో మట్టి ఖర్చుల నిమిత్తం గురువారం రూ.10 వేలు అందజేశారు. సెక్రటరీ శివశంకర్ మాట్లాడుతూ పెదకొండూరులో నివాసముండే కొండూరు కిరణ్ (40) గుండె పోటుతో మృతి చెందాడు. వలంటీర్ ద్వారా సమాచారం తెలియడంతో వెంటనే వివరాలు సేకరించి కిరణ్ కుటుంబానికి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు అందజేశామని, వైఎస్సార్ బీమా పథకం కింద రావలసిన మొత్తాన్ని త్వరలోనే కిరణ్ భార్య సునీతకు అందజేయనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సౌజన్య, ఎంపీటీసీ సభ్యుడు కొండూరు సుమన్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



తాడేపల్లిరూరల్: రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ఆధ్వర్యంలో గురువారం నుంచి నిర్వహిస్తున్న చికిత్సా శిబిరానికి విశేష స్పందన లభిస్తోందని క్లబ్ అధ్యక్షుడు మున్నంగి వివేకానందరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ వైద్య శిబిరం 16వ తేదీ వరకు జరుగుతుందని, మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. శిబిరంలో ఆక్యుప్రెజర్, వైబ్రేషన్ థెరపి సేవలు అందుబాటులో ఉంటాయని, సయాటిక, తలనొప్పి, జాయింట్ పెయిన్, బ్రాంకైటిస్, నిద్రలేమి, కంటి, కీళ్ల నొప్పులకు చికిత్స నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి వైస్ ప్రెసిడెంట్ కిరణ్ పరుచూరి, ట్రెజరర్ రామకృష్ణశెట్టి, కొట్టి వెంకట చంద్రశేఖర్‌రెడ్డి, జొన్నా రాజేష్, సుకుమార్‌రెడ్డి, రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి రోటరీ ఆర్థిక సాయం



తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని ఉండవల్లిలోని ఓ విద్యార్థికి రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షుడు మున్నంగి వివేకానందరెడ్డి గురువారం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఉండవల్లికి చెందిన పట్నాల భావన తెనాలి గుప్తా కాలేజీలో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ మూడో సంవత్సరం చదువుతోందని, కాలేజీ ఫీజు కట్టుకోలేని పరిస్థితుల్లో ఉన్నారన్న విషయాన్ని తెలుసుకుని రూ.17 వేల ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నామని అన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ ఒక్కరూ విద్యను మధ్యలో ఆపరాదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి వైస్ ప్రెసిడెంట్ పరుచూరి కిరణ్, ట్రెజరర్ రామకృష్ణ, కొల్లి వెంకట చంద్రశేఖర్‌రెడ్డి, సుకుమార్‌రెడ్డి, రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీదేవి అలంకారంలో మహంకాళి అమ్మవారు



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరు గ్రామంలోని శ్రీ మహంకాళి అమ్మవారి ప్రతిష్ఠ వార్షికోత్సవాల్లో భాగంగా రెండో రోజైన గురువారం అమ్మవారికి సరస్వతీదేవి అలంకారం చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి చినవెంకటరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని తెలిపారు.

16న చదవడం మాకిష్టం

ఫిరంగిపురం: మండలకేంద్రంలోని గాలిబాలి శాఖ గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. రిసోర్సుపర్సన్స్ కె.ఫ్రాన్సిస్, పి.సుందరరావులు విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయాధికారి పి.సత్యశిరీష మాట్లాడుతూ 16న విద్యార్థులకు చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. దానిలో భాగంగా ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటలవరకు విద్యార్థులకు అందమైన చేతిరాత రాసేవి విధానంలో ఉపాధ్యాయుడు జున్నుసాహెబ్ శిక్షణ ఇస్తారని తెలిపారు. మధ్యాహ్నం శిక్షణలో పాల్గొనే విద్యార్థులకు ఉచిత భోజన వసతి కల్పిస్తామన్నారు. పాల్గొనదలచిన విద్యార్థులు 9985894150 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పేదరిక నిర్మూలనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం

- మనస్పర్థలను పక్కన బెట్టి మళ్లీ వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తాం
- వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి. చిత్రంలో ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి తదితరులు

మంగళగిరి: రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, మనస్పర్థలను పక్కనబెట్టి రానున్న ఎన్నికలలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేస్తామని ఆ పార్టీ మంగళగిరి–తాడేపల్లి నగర అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. నగరంలోని ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయంలో గురువారం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వేమారెడ్డి మాట్లాడుతూ మంగళగిరి–తాడేపల్లి నగర అధ్యక్షుడిగా తనకు అవకాశం కల్పించిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో కార్పొరేషన్ పరిధిలో ఎమ్మెల్యే అభ్యర్థికి అత్యధిక మెజార్టీని అందిస్తామన్నారు. ప్రజాహిత కార్యక్రమాలు ఏర్పాటు చేయడంతో దేశంలోనే సీఎం జగన్ మొదటి స్థానంలో ఉన్నారని, మేనిఫెస్టోలోని పథకాలను తూచ తప్పకుండా అమలు చేసిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చి ఇచ్చిన మాటకు కట్టుబడి అమలు చేశారని గుర్తు చేశారు. ప్రభుత్వ పథకాలను అధ్యయనం చేసి దేశంలోని ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు సైతం వారి వారి రాష్ట్రాల్లో పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలతోపాటు ఆర్థికంగా వెనుకబడిన ఇతర కులాలకు ప్రయోజనకరమైన కార్యక్రమాలను చేపట్టిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నియోజకవర్గంలో నాయకుల మధ్య చిన్న చిన్న మనస్పర్థలు, సమస్యలు ఉండొచ్చని, వాటన్నింటినీ అధిగమించి మరోసారి మంగళగిరిలో పార్టీ జెండా ఎగుర వేసేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. తొలుత నగరంలోని అంబేడ్కర్ సెంటర్‌లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నగర అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి పార్టీ నేతలతో కలసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, తాడేపల్లి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, నాయకులు ఎండీ ఇక్బాల్ అహ్మద్, ముహమ్మద్ రఫీ, గోరె బాబు, సంకె సునీత, ఎండీ ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను జయప్రదం చేయండి

ఏర్పాట్లు పరిశీలించిన కత్తెర సురేష్‌కుమార్



ఏర్పాట్లు పరిశీలిస్తున్న సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్

తాడికొండ: నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు తాడికొండలో శుక్రవారం జరగనున్న జాబ్‌మేళాను జయప్రదం చేసేందుకు అందరూ సహకరించాలని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో తాడికొండ బీఎస్ఎస్‌బీ కళాశాలలో జాబ్‌మేళా జరగనున్న ప్రాంతాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి అన్ని విధాలా ఆదుకునేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. అందులో భాగంగా తాడికొండలో స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ, డీఆర్‌డీఏ, ఉపాధి హామీ కార్యాలయం ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నారు కనుక నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు మండల స్థాయి అధికారులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎయిమ్స్ నర్సింగ్ సిబ్బంది ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఎయిమ్స్ నర్సింగ్ సిబ్బంది

మంగళగిరి: అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నగరంలోని ఎయిమ్స్ ఆసుపత్రి నర్సింగ్ సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎయిమ్స్ ఆవరణలోని ఓపీడీ బ్లాకు వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ గేటు వరకు, తిరిగి ఓపీడీ వరకూ మూడు కిలోమీటర్ల మేర సాగింది. నర్సింగ్ విద్యార్థులు ప్లకార్డులు చేతబట్టి లిఫ్ట్ వద్దు... మెట్లు ముద్దు... నడవండి బాగా... ఉండండి హాయిగా అంటూ నినాదాలు చేశారు. పలువురు నర్సింగ్ విద్యార్థులు మాట్లాడుతూ ఈనెల 12వ తేదీ అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా ఫ్లోరెన్స్ నైటింగేల్‌ను జ్ఞాపకం చేసుకుంటూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా ప్రజలకు, రోగులకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ చేపట్టడం జరిగిందన్నారు. ప్రధానంగా నడక ఏవిధంగా ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందో అనే దానిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించే ప్రయత్నంలో భాగంగా ర్యాలీ చేపట్టినట్లు తెలిపారు.

తాగునీటి సరఫరాపై అశ్రద్ధ వద్దు



అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరంలో తాగునీటి సరఫరాలో ఎక్కడా సమస్యలు రాకుండా ఇంజినీరింగ్ అధికారులు, ఎమినిటీ కార్యదర్శులు పక్కా ప్రణాళికతో విధులు నిర్వహించాలని, సమస్యలు వస్తే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. ఆమె గురువారం వెంగళాయపాలెంలోని నగరపాలక సంస్థ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్, ఆవుల సంరక్షణ కేంద్రం, వెంకటరమణ కాలనీలో ఎన్ఓసీకి దరఖాస్తు చేసుకున్న భవనాల్ని పరిశీలించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. తొలుత వెంగళాయపాలెంలో నగరపాలక సంస్థ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ని పరిశీలించారు. చెరువు విస్తీర్ణం, నీటి నిల్వ, నగరానికి సరఫరా మార్గంపై ఇంజినీరింగ్ అధికారుల్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాగునీటి సరఫరాలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వెంగళాయపాలెం చెరువులో పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేయడానికి, మోటార్ల మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎస్ఈని ఆదేశించారు. చెరువు పూర్తిస్థాయిలో నీటితో ఉంటేనే నగరంలోని ఏటీ అగ్రహారం, హౌసింగ్ బోర్డ్ తదితర రిజర్వాయర్ల పరిధిలోని ప్రాంతాలకు సమృద్ధిగా తాగునీటిని సరఫరా చేయగలమని చెప్పారు. చెరువు నింపేందుకు ఎన్ఎస్‌పీ కెనాల్ ఆధారం కనుక ఇరిగేషన్ అధికారులతో చర్చించాలని ఆదేశించారు. చెరువు పరిసరాల్లో వీధి ఆవుల సంరక్షణకు కేటాయించిన సిబ్బంది బాధ్యతగా పని చేయాలని, వాటికి సకాలంలో ఆహారం అందించేలా చూడాలని తెలిపారు. వారానికి రెండు రోజులు పశు వైద్యులు వచ్చేలా ఆ శాఖ జాయింట్ డైరెక్టర్‌కు లేఖ రాయాలని ఎంహెచ్ఓని ఆదేశించారు. అనంతరం వెంకట రమణ కాలనీలో ఎన్ఓసీకి దరఖాస్తు చేసుకున్న భవనాల్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఈ భాస్కర్, ఎంహెచ్ఓ డాక్టర్ భానుప్రకాష్, డెప్యూటీ సిటీప్లానర్ మూర్తి, ఏసీపీ బాబూరావు, ఈఈలు సుందరరామిరెడ్డి, కొండారెడ్డి, డీఈఈ రమేష్‌బాబు, సర్వేయర్ సునీల్ కుమార్, టీపీఎస్ లక్ష్మణస్వామి, ఏఈ నాగవేణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునరావు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

పోస్టల్ యూనియన్ గుర్తింపును పునరుద్ధరించాలి



ప్రదర్శనలో పాల్గొన్న ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల నేతలు

లక్ష్మీపురం: పోస్టల్ రంగంలో అతి పెద్ద యూనియన్‌గా ఉన్న నేషనల్ ఫెడరేషన్‌ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్(ఎన్ఎఫ్‌పీఈ) గుర్తింపును పునరుద్ధరించాలని కోరుతూ నగరంలోని శంకర్ విలాస్ సెంటర్ నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సర్కిల్ వరకు గురువారం సాయంత్రం భారీ ప్రదర్శన నిర్వహించారు. శాసన మండలి సభ్యుడు కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ పోస్టల్ రంగంలో ప్రైవేటీకరణ విధానాల్ని వ్యతిరేకిస్తూ పలు ఉద్యమాలు చేస్తున్న ఎన్ఎఫ్‌పీఈ గుర్తింపును అప్రజాస్వామికంగా రద్దు చేయడం కార్మిక సంఘాల హక్కుల్ని కాలరాయడమేనని తెలిపారు. సహేతుకమైన కారణాలు చూపకుండా కేవలం రైతుల ఉద్యమానికి, సోదర సంఘాల ఉద్యమాలకు ఆర్థికంగా సహాయపడ్డారనే నెపంతో యూనియన్‌గుర్తింపును నిరాకరించడం ప్రజాస్వామ్య పద్ధతుల్ని దెబ్బతీయడమేనని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గుర్తింపును పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై. నేతాజి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక సంఘాల మనుగడను దెబ్బతీస్తోందని విమర్శించారు. కార్మిక చట్టాల్ని ఏకపక్షంగా రద్దు చేసి నూతన లేబర్ కోడ్స్‌ను తీసుకొచ్చిందని తెలిపారు. కార్మిక వ్యతిరేక విధానాల్ని ఐక్య పోరాటాల ద్వారా ఎదుర్కొంటామని చెప్పారు. కార్యక్రమంలో వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సంఘాలు, పెన్షనర్స్ తరపున ఎం.రామకృష్ణ, వి.వి.కె. సురేష్, సీహెచ్. కుమార్, ఎం. కళాధర్, బి.ముత్యాలరావు, ఎల్.అరుణ, మేడా హనుమంతరావు, ఎం.ఏ.చిష్తి, ఎస్ నాగేశ్వరరావు, ఎం. శ్రీనివాసరావు, కె. భాను ప్రసాద్, టి.వి.జి.రవిశంకర్, సీహెచ్. విద్యాసాగర్, బి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

నీటి తీరువా పన్నులు వెంటనే చెల్లించండి

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలంలో భూములు కలిగిన రైతులందరూ నీటితీరువా, ఇతర పన్నులు వెంటనే చెల్లించాలని దుగ్గిరాల తహసీల్దార్ మల్లేశ్వరి గురువారం ఒక ప్రకటనలో కోరారు. పన్నులు చెల్లించేందుకు సంబంధిత గ్రామ సచివాలయాలకు వెళ్లాలని సూచించారు.

చిల్లర దుకాణం దగ్ధం



మేడికొండూరు: మండల పరిధిలోని మందపాడు గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు చిల్లర దుకాణానికి నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలిపోయింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మందపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా ఎస్.కె. సైదులు కుటుంబం కొన్నాళ్లుగా జీవనం సాగిస్తోంది. ఇంటి ముందు ఖాళీ స్థలంలో రేకుల షెడ్డుతో చిల్లర దుకాణం పెట్టుకుని వ్యాపారం చేస్తుంటారు. బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారు. గ్యాస్ సిలిండరు ఉండటంతో మంటలు వ్యాప్తించడంతో అదుపు చేయకపోవడంతో దుకాణం పూర్తిగా కాలిపోయింది. గతంలో ఇదే తరహాలో దుకాణానికి నిప్పంటించారని బాధితులు తెలిపారు. ఘటనపై మేడికొండూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై లైంగిక దాడి

గుంటూరు ఈస్ట్: బాలికపై యువకుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీనగర్ 2వ లైనులో నివసించే సునీల్ చంద్రయ్యనగర్‌లోని స్నేహితుడి ఇంటికి వెళుతుంటాడు. ఈ సమయంలో పక్కనే ఉన్న ఇంట్లోని బాలికతో పరిచయం పెంచుకున్నాడు. బుధవారం తన పుట్టిన రోజు అని చెప్పి ఆమెను ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని ఇంటికి తీసుకెళ్లాడు. అక్కడ బలవంతంగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం బాలికను ఇంటి సమీపంలో వదిలిపెట్టి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య

ఇంజినీరింగ్ విద్యార్థిని ఆత్మహత్యపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈపూరుకు చెందిన వెంకట నరసింహారావు కుమార్తె జి.శ్రీప్రణీత (20) గుంటూరు విద్యానగర్‌లోని బంధువుల ఇంట్లో ఉండి ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతోంది. చదువులో వెనుకబడడంతో మానసికంగా కుంగిపోయి ఈనెల 7న ఎలుకల మందు తిని, కుటుంబ సభ్యులకు ఆలస్యంగా చెప్పింది. ఆమెను నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

72 మద్యం సీసాలు స్వాధీనం



ఫిరంగిపురం: మద్యం సీసాలు అక్రమంగా అమ్ముతున్న మహిళను పోలీసులు అరెస్టు చేసిన సంఘటన మండలంలోని పానుగుపాడు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని ఎస్సీ కాలనీలో ప్రభుత్వ దుకాణంలో అమ్మే మద్యం సీసాలు అక్రమంగా అధిక ధరకు ఆర్.సుందరమ్మ అమ్ముతోంది. సమాచారం మేరకు బుధవారం పోలీసులు నిఘా పెట్టడంతో అక్రమంగా మద్యం అమ్ముతున్న సుందరమ్మను పోలీసులు పట్టుకొని ఆమె వద్ద నుంచి 72 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నరసరావుపేట రెండో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వద్ద హాజరు పరచడంతో ఆమెను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు లారీ క్లీనర్ల మృతి





మృతి చెందిన లారీ క్లీనర్ బండారు వర్మ (ఫైల్), పెద్దాపురం వెంకటేశం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు లారీ క్లీనర్లు మృతి చెందారు. తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం బోయపాలెంకు చెందిన బండారు వర్మ (20) తెల్లవారుజామున గుండిమెడ ఇసుక రీచ్‌కు వెళ్లారు. ఇసుక లోడింగ్ చేస్తున్న సమయంలో లారీలో ఉన్న టార్పాలిన్ పట్ట తీసేందుకు బాడీలోకి దిగగా చూసుకోకుండా పొక్లయినర్ డ్రైవర్ లోడింగ్ చేశాడు. లోడ్ మొత్తం అయిపోయిన తరువాత క్లీనర్ కనిపించడం లేదని అనుమానం రావడంతో ఇసుక అన్‌లోడ్ చేయగా ఇసుకలో కూరుకుపోయి కనిపించాడు. వెంటనే ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు.

- కొలనుకొండ రైల్వే బ్రిడ్జి వద్ద లారీ అదుపుతప్పి బోల్తా పడడంతో తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా పుల్కల్‌కు చెందిన పెద్దాపురం వెంకటేశం (35) అక్కడికక్కడే మృతి చెందాడు. తాడేపల్లిలో ఉన్న ఇంజిన్ ఆయిల్ కంపెనీలో లోడ్ చేసుకుని వెళుతున్న లారీ కొలనుకొండ రైల్వే బ్రిడ్జి వద్ద అదుపు తప్పి బ్రిడ్జి పక్క నుంచి బోల్తా పడింది. ఈ సమయంలో క్లీనర్ వెంకటేశం లారీలో నుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. రెండు సంఘటనలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య కేసు కొట్టివేత

మంగళగిరి: తాడేపల్లి పట్టణం ప్రకాష్‌నగర్‌కు చెందిన ఓ వివాహిత ఆత్మహత్య కేసును కొట్టివేస్తూ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి నాగరాజు గురువారం తీర్పు చెప్పారు. ప్రకాష్‌నగర్‌కు చెందిన దాసరి ఆనంద్‌కు కృష్ణా జిల్లా మంటాడకు చెందిన కాలపురెడ్డి లక్ష్మణ కుమార్తె వెంకటలక్ష్మి(26)తో ఎనిమిదేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం. ఆనంద్ మార్బుల్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. 10.01.2018న తన తన బావమరిదికి ఫోన్ చేసి వెంకటలక్ష్మి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పాడు. దీంతో మృతురాలి తల్లిదండ్రులు, సోదరుడు ఇక్కడికి వచ్చి చూడగా కుమార్తె ఒంటిపై గాయాలు గుర్తించారు. మృతురాలి భర్త దాసరి ఆనంద్, అత్త కనకలక్ష్మి, మామ నరసింహారావులపై అనుమానం ఉందంటూ లక్ష్మణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్ఐ ప్రతాప్‌కుమార్ 174 సెక్షన్ కింద అనుమానాస్పద మృతి కేసు నమోదు చేశారు. తదుపరి ఎస్ఐ ఎ శ్రీనివాసరావు ఐపీసీ 306 సెక్షన్ కింద ఛార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసు ఇటీవల మంగళగిరి అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టులో విచారణకు రాగా వాదోపవాదాల అనంతరం నిందితులపై నేరం రుజువు కాకపోవడంతో వారిని నిర్దోషులుగా ప్రకటిస్తూ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి నాగరాజు గురువారం తీర్పు చెప్పారు. నిందితుల తరపున సీనియర్ న్యాయవాది వేమూరి రత్నప్రసాద్, ఎం.గోవర్ధన్‌లు డిఫెన్స్ నిర్వహించారు.

సీఐ తీరును నిరసిస్తూ ఆందోళన

మంగళగిరి: రాజధానికి భూములు ఇచ్చిన రైతులపై తప్పుడు కేసులు బనాయించిన సర్కిల్ అధికారి భూషణం తీరును నిరసిస్తూ గురువారం రైతు సంఘ నేతలు నగరంలోని రూరల్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహించారు. వారు మాట్లాడుతూ నగర పరిధిలోని నిడమర్రుకు చెందిన గైరుబోయిన నాగేశ్వరరావుపై పోలీసులు దౌర్జన్యం చేసి అదుపులోకి తీసుకోవడం తగదన్నారు. రైతు నాగేశ్వరరావుకు చెందిన 1.57 ఎకరాల పొలం తీసుకున్న ప్రభుత్వం 1940 గజాల స్థలం కేటాయించడంలో వివక్ష చూపడం అన్యాయమని, అడిగినందుకు మంగళగిరి రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వ అధికారులు ల్యాండ్ పూలింగ్‌కు ఇవ్వని రైతు నాగేశ్వరరావు భూముల్లో హద్దు రాళ్లు పాతుతుండటం ఏమిటని ప్రశ్నిస్తే స్టేషన్‌కు తరలించడం తగదన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నేతలు జొన్నా శివశకర్, కళ్లం రాజశేఖరెడ్డి, ఎం భాగ్యరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

నగరంపాలెం: ఆర్.అగ్రహారంలోని శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వ్యవస్థాపక ధర్మకర్త వెంకటబుచ్చిరామశాస్త్రి, కార్యనిర్వాహణాధికారి పగడాల శివకోటేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు ముత్తురాజు, కె.శ్రీవల్లి, శికుమారి, 18వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ పాల్గొన్నారు.

ఉత్సవమూర్తులకు పంచామృత అభిషేకం

పాత గుంటూరులోని విశాఖ శ్రీ శారదా పీఠ పరిపాలిత శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో హనుమాన్ జయంతి వేడుకలు రెండో రోజుకి చేరాయి. గురువారం తెల్లవారుజామున 5.30 గంటల నుంచి ప్రభాత సేవ, ఆలయ ప్రదక్షిణలు, ఆకు పూజలు, తీర్థ గోష్టి, ప్రసాద వినియోగం నిర్వహించారు. తొమ్మిది గంటలకు శ్రీ వీరాంజనేయస్వామికి పంచామృత అభిషేకం చేశారు. భక్తులు బారులుతీరి స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కొప్పురావూరి బాబూరావు, కార్యదర్శి కాసుల సాంబశివరావు, కోశాధికారి గ్రంధి కోటేశ్వరరావు, సభ్యులు ఆత్మకూరి లక్ష్మణరావు, చీమకుర్తి తాండవ నాగమల్లేశ్వరరావు, కాసుల వెంకటశివప్రసాద్, నాగం రామారావు పాల్గొన్నారు.

సిగ్నల్స్ అండ్ సిస్టమ్స్ పుస్తకం ఆవిష్కరణ

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అకడమిక్ ఎఫైర్స్ డీన్ ఆచార్య ఈ. శ్రీనివాసరెడ్డి రాసిన 'సిగ్నల్స్ అండ్ సిస్టమ్స్' పుస్తకాన్ని గురువారం వీసీ ఆచార్య పి రాజశేఖర్, రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులకు జాతీయ స్థాయి లో ప్రయోజనకరమైన పుస్తకాన్ని ఏఎన్‌యూ అధ్యాపకుడు రాయడం అభినందనీయమన్నారు. రచయి త శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గేట్, ఐఈఎస్ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఈ పుస్తకం ఎంతో ఉపకరిస్తుందని తెలిపారు. సులభతరమైన అంశాలతో విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. బీఎస్ పబ్లికేషన్ సంస్థ ఈ పుస్తకాన్ని ప్రచురిస్తుందని తెలిపారు. ఇంజినీరింగ్ విద్యార్థుల కోసం తాను ఇప్పటికే ఆరు పుస్తకాలు, రెండు వ్యక్తిత్వ వికాస కథా సంకలనాలు రాశానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ర్యాంకింగ్స్ కోఆర్డినేటర్ డాక్టర్ బీహెచ్. నాగకిశోర్, సీఈ నరసారెడ్డి, వికాస అధ్యక్ష, కార్యదర్శులు అనిల్ కుమార్, శ్రీనివాసరావు, యూఈ కుమార్ రాజు, డీఈ అప్పారావు పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లకు పాల్పడిన ఇద్దరి అరెస్టు



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న వెస్ట్ డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి

గుంటూరు ఈస్ట్: సెంట్రల్ జీఎస్టీ అధికారులమంటూ వసూళ్లకు పాల్పడిన ఇద్దరు నిందితుల్ని అరండల్‌పేట పోలీసులు అరెస్టు చేశారు. పోలీసు స్టేషన్‌లో గురువారం వెస్ట్ డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి, ఎస్‌హెచ్ఓ రామానాయక్‌లు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సెంట్రల్ జీఎస్టీలో గుమస్తాగా పనిచేసే జి.వెంకటబాబు, స్నేహితుడ్ని వెంటబెట్టుకుని ఈనెల 6వ తేదీ బ్రాడీపేట 6/14లోని గేమ్ వరల్డ్ షాపునకు వెళ్లారు. యజమాని షేక్ ఖాజాను తాము సెంట్రల్ జీఎస్టీ అధికారులమంటూ పరిచయం చేసుకున్నారు. వెంకటబాబు తీసుకొచ్చిన ద్విచక్ర వాహనంపై జీఎస్టీ అని రాసి ఉండటంతో ఖాజా అధికారులని నమ్మాడు. ఇద్దరు జీఎస్టీ చెల్లించాలని బెదిరించారు. ఖాజా అందుకు ఒప్పుకొని రూ. 1700 చెల్లించాడు. అనంతరం ఇద్దరు షాపులోని బ్లూటూత్‌ను అడిగి తీసుకుని వెళ్లారు. ఖాజా నిందితులు వచ్చిన ద్విచక్ర వాహనం నంబరు నోటు చేసుకుని అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేసిన పోలీసులు నిందితులు వెంకటబాబు, అతని అనుచరుడు దార్ల సురేష్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. గురువారం ఇద్దరిని అరెస్టు చేసి రూ. 1700తో పాటు బ్లూటూత్, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు అమర్చుకోవాలని సూచించారు. ఈ కేసులో వాటి ఆధారంగానే నిందితుల్ని గుర్తించామని తెలిపారు. సైబర్ క్రైం కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని, ప్రజలు వీటిపై అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. అత్యాశకు పోకూడదన్నారు. సోషల్ మీడియాలో వచ్చే లింకుల్ని ఆన్ చేయవద్దని తెలిపారు. కేసు పురోగతిలో కృషి చేసిన అధికారులు, సిబ్బందిని అభినందించారు.